
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 8 మార్చి 2024 | 5







ఎన్నికల ప్రవర్తనా నియమావళి పుస్తకంతో కలెక్టర్ శుక్లా

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సంపూర్ణ అవగాహన ఉండాలి

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు నుంచి ఎన్నికలు ముగిసే వరకు ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన రోజున రిటర్నింగ్ అధికారి ఫారం-1 నోటీసు ప్రచురిస్తారన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి రిటర్నింగ్ అధికారి సూచించిన ప్రదేశంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం పరిధి దాటి వాహనాలను లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. నామినేషన్ సమయంలో ఐదుగురు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుంది. నామినేషన్ వేసే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అభ్యర్థుల ఖర్చులు, అకౌంటింగ్ విధానాన్ని తెలియజేశారు. ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్‌శర్మ, రాజకీయ పార్టీల నాయకులు దూరి రాజేష్, సంసాని చంద్రశేఖర్, నల్లా మల్లిబాబు, కుడుపూడి శ్రీనివాస్, కాశి లక్ష్మీభవానీ, పి.పవన్ సూర్య, కారెం వెంకటేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ముస్తాబు

ఐ.పోలవరం/అయినవిల్లి/కోటిపల్లి/కాట్రేనికోన, మార్చి 7: మహా శివరాత్రికి మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని, అయినవిల్లి ముక్తేశ్వరాలయంలో ముక్తికాంత క్షణ ముక్తేశ్వర క్షేత్రాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మురమళ్ళ మార్కెట్ సెంటర్ నుంచి ఆలయం వరకు మిరుమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు. ముఖ ద్వారం నుంచి ఆలయం వరకు భక్తులను ఆకట్టుకునేలా ప్రత్యేక అలంకరణ చేశారు. మహాశివరాత్రి పర్వదినాన వీరేశ్వరస్వామికి పుష్కర నదీ జలాలతో అభిషేకం చేయనున్నారు. ముక్తేశ్వరంలో మహా శివరాత్రి బ్రహ్మముహూర్తం లగాయితు రాత్రి లింగోద్భవ కాలం వరకు శ్రీక్షణముక్తేశ్వరస్వామివారి దర్శనం, వేదపారాయణ, శైవాగమోక్త ప్రకారం మహాన్యాసాది రుద్రాభిషేక పూజలు, శ్రీముక్తికాంత అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. కోటిపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి రథోత్సవం జరిపారు. కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో కుండలేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వర రావు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు.



అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో క్షణ ముక్తేశ్వర స్వామి



ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామి

కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో కుండలేశ్వరస్వామి

'నాడు-నేడు'లో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతాం... నిరుపేదలకు ఉత్తమ విద్య అందిస్తాం... అంటూ వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. నిధుల లేమితో కొన్నిచోట్ల భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల తరగతి గదులే మంజూరు కాక విద్యార్థులు పరాయిపంచన చదువుకోవాల్సి వస్తోంది.



బెల్లంపూడిలో లూథరన్ చర్చి ఫాదర్ నివాసంలో పాఠాలు చెప్పున్న దృశ్యం

పరాయిపంచన!

- పాఠశాల పైకప్పు నుంచి ఊడిపడుతున్న పెచ్చులు
- ఎనిమిది నెలలుగా 'ప్రైవేటు'గానే బోధన
- పట్టించుకోని అధికారులు
- తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి గ్రామస్తుల సన్నాహాలు
- ఇదీ బెల్లంపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి

పి.గన్నవరం, మార్చి 7:

పి.గన్నవరం మండలం బెల్లంపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడడంతో గతేడాది జులై నుంచి 28 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు పరాయిపంచనే పాఠాలు చెప్తున్నారు. ఈ పాఠశాలలో సమస్యలు కొన్నేళ్లుగా అలాగే వున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. 40 ఏళ్ల నాటి పాఠశాల భవనాన్ని ఇటీవలే తొలగించారు. ప్రస్తుతం ఉన్న భవనం నిర్మించి పదేళ్లే అయినా నాణ్యతాలోపంతో పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని తొలగించాలంటే స్ట్రక్చర్ కాలం ఇంకా పూర్తికాలేదని అధికారులు చెప్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో స్థానికంగా ఒక చర్చి ఫాదర్ ఇంట్లో పాఠశాల నడుపుతున్నారు. నాలుగు నెలలు అని చెప్పి పాఠశాలను మార్పు చేస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం నూతన భవన నిర్మాణం చేపట్టలేకపోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులను అడిగితే అదిగో.. ఇదిగో అంటూ గడుపుకొస్తున్నారని మండిపడుతున్నారు. వర్షకాలం వస్తే పాఠశాల ఆవరణ కాస్తా చెరువులా మారిపోతుందని, రక్షణగా ప్రహరీ కూడా నిర్మించలేకపో యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరోపక్క మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు కొన్నేళ్ల క్రితం నిర్మించిన షెడ్డు అసంపూర్తిగా నిలిచిపోయి దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. గ్రామస్తుల సహకారంతో పాటు పాఠశాల ఇతర నిధులతో తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఈ విషయమై విద్యా శాఖ మండల అధికారులను ప్రశ్నించగా.... నూతన భవన నిర్మాణానికి 2019 నుంచి ప్రతి ఏటా ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నామని, ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.





పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడుతున్న దృశ్యం, బెల్లంపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన వంటశాల



విజయవాడలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ తదితరులు

అంతర్జాతీయ శిక్షణకు ఎంపికైన కోనసీమ టూర్స్ యాప్ ప్రాజెక్టు

అమలాపురం రూరల్, మార్చి 7: పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన కోనసీమ టూర్స్ యాప్ రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ చాటి అంతర్జాతీయ శిక్షణకు ఎంపికైంది. విజయవాడలో ఏపీ ఏఎండీపీ రాష్ట్రస్థాయి ఎక్స్‌పోలో కోనసీమ టూర్స్ యాప్‌ను అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శిక్షణ కోసం ఎంపిక చేసినట్టు హెచ్ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. జీవ శాస్త్ర ఉపాధ్యాయిని ఏటీ చంద్రావతి పర్యవేక్షణలో 9వ తరగతి విద్యార్థులు కె.జయేంద్ర, సీహెచ్ లోకేశ్ కోనసీమ టూర్స్ యాప్‌ను రూపొందించారు. విద్యార్థుల్లో పారిశ్రామిక మనస్తత్వం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో పాలగుమ్మి విద్యార్థులకు కమిషనర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ ఎస్.సురేష్‌కుమార్, సమగ్ర శిక్షా ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, తులసిపద్మావతి అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాలోని పది మండలాల్లో హైస్కూళ్లలో ప్లస్ కో-ఎడ్యుకేషన్

డీఈవో కమలకుమారి

ముమ్మిడివరం, మార్చి 7: 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని పది మండలాల్లో హైస్కూలు ప్లస్ కో-ఎడ్యుకేషన్ ప్రారంభించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్టు జిల్లా పాఠశాలల విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. కపిలేశ్వరపురం మండలం అంగర, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం, పి.గన్నవరం, కాట్రేనికోన మండలం కందికుప్ప, అల్లవరం మండలం కొమరగిరిపట్నం, ఆత్రేయపురం మండలం పేరవరం, అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు, సఖినేటిపల్లి మండలం రామేశ్వరం, అమలాపురం సూర్యనగర్ జడ్పీ హైస్కూళ్లను కో-ఎడ్యుకేషన్ ఏర్పాటుకు ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి కనీసం రెండు ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉండాలని, అందులో ఒక కళాశాల కేవలం బాలికలకు, మరొకటి సహ విద్యకు మంజూరు చేశారన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి బాలికల హైస్కూలు ప్లస్ కొనసాగిస్తూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కో-ఎడ్యుకేషన్‌ను హైస్కూలు ప్లస్‌లేని పది మండలాలకు మండలానికి ఒకటి వంతున ప్రారంభిస్తున్నారన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో ఏదైనా రెండు గ్రూపులు ఉండాలని, గ్రూపునకు 40 మంది విద్యార్థులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆధార్ నమోదులో తప్పిదాలతో.. ప్రభుత్వంపై అపరాధ రుసుము భారం

అమలాపురం టౌన్, మార్చి 7: ఆధార్ నమోదులో గ్రామ, వార్డు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు చేసిన తప్పిదాల వల్ల ప్రభుత్వంపై అపరాధ రుసుముల భారం పడుతోందని గ్రామ, వార్డు సచివాలయ జిల్లా నోడల్ అధికారి కె.భీమేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ వర్క్ షాపు నిర్వహించి తప్పులు నమోదు కాకుండా తీసుకోవలసిన చర్యలపై ఆధార్ ప్రోగ్రాం మేనేజర్ గిరిధర్ అవగాహన కల్పించారు. ఆధార్ నమోదులో తప్పిదాల వల్ల అపరాధ రుసుము విధించే వాటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ఈ మొత్తాన్ని అసలు సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లు చెల్లించాల్సి ఉండగా ఆ భారాన్ని సచివాలయ విభాగంపై వేస్తున్నారని వివరించారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్ వీఎస్ఎస్ సుందరం, జిల్లా కో-ఆర్డినేటర్ సువిజయ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కేంద్ర బలగాలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ శ్రీధర్

జిల్లాకు నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు

సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలి: ఎస్పీ శ్రీధర్

పి.గన్నవరం, మార్చి 7: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో బందోబస్తు నిమిత్తం నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని ఎస్పీ కె.శ్రీధర్ తెలిపారు. పి. గన్నవరంలోని కోకోనట్ కల్యాణ మండపంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రావులపాలెం, మండపేట, అమలాపురం, పి.గన్నవరంల్లో వారికి షెల్టర్ ఏర్పాటు చేశామన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా స్థానికంగా వున్న పరిస్థితులు, జిల్లాలోని పరిస్థితులు, రాజకీయ పరిణామాలపై కేంద్ర బలగాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు బలగాలన్నీ ఇక్కడే ఉంటాయని, ముఖ్య కూడళ్లు, ముఖ్య గ్రామాల్లో కవాతు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. డీఎస్పీ కె.వెంకటరమణ, సీఐలు కె.ప్రశాంత్‌కుమార్, ఆర్.గోవింద రాజు, ఎస్ఐలు బి.శివకృష్ణ, పీఎస్ఎస్ఎన్ సురేష్, జి.పృథ్వి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

89,619 మంది మహిళలకు రూ.168 కోట్ల 'చేయూత'

అమలాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల సమగ్ర అభివృద్ధి, మెరుగైన జీవనోపాధుల కోసం ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. చేయూత చివరి విడత ఆర్థిక సాయాన్ని గురువారం పిసినిగాడ బహిరంగ సభలో సీఎం జగన్ బటన్ నొక్కి మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాల్గో విడత కింద 89,619 మంది మహిళలకురూ.168.03 కోట్ల మేర చేయూత లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులతో కలిసి మహిళలకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎల్డీఎం కె.శ్యామ్‌బాబు, ఏపీడీ ఎంఎం జిలానీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే-అవుట్లను ప్రోత్సహించకండి

బీపీఎంఎస్‌లోనే ప్లాన్ అప్రూవల్ చేయాలి... పాత తేదీలు వేసి అప్రూవల్ ఇస్తే కఠిన చర్యలు: రుడా, అముడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి



అమలాపురం రూరల్, మార్చి 7: అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అమలులోకి వచ్చినందున పంచాయతీల కార్యదర్శులు ఇళ్ల అక్రమ నిర్మాణాలను, అనధికార లే-అవుట్లను ప్రోత్సహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని రుడా, అముడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి పేర్కొన్నారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఎక్కడైనా కార్యదర్శులు ఇబ్బందులకు గురైతే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలని సూచించారు. అముడా అమలులోకి వచ్చినందునపాత తేదీలు వేసి అప్రూవల్ ఇస్తే సంబంధిత కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని పంచాయతీల కార్యదర్శులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఈదరపల్లి సచివాలయం-2లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు అధ్యక్షతన గురువారం శిక్షణ ఇచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు మాట్లాడుతూ కార్యదర్శులకు ఇప్పటికే పని భారం పెరిగిందని, అయినప్పటికీ అమలాపురం పట్టణ, పరిసర ప్రాంతాల అభివృద్ధి, భవిష్యత్తు దృష్ట్యా నిబంధనలు పాటిస్తూ అముడాను అభివృద్ధి చేయాలని సూచించారు. వైస్ చైర్మన్ బాలస్వామి మాట్లాడుతూ అముడా పరిధిలోకి జిల్లాలోని 14 మండలాలకు సంబంధించి 176 రెవెన్యూ గ్రామాలు వచ్చాయన్నారు. వాటికి సంబంధించి 231 పంచాయతీల కార్యదర్శులు అముడా అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని కోరారు. అముడా ఆధ్వర్యంలో అర్బన్ డెవలప్‌మెంట్ కింద భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను విరించారు. గ్రామాల్లో బ్యూటిఫికేషన్, గ్రీనరీ, రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలను పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తామ న్నారు. ఇక నుంచి మాన్యువల్‌గా ప్లాన్ అప్రూవల్ చేయరాదన్నారు. పాత తేదీలు వేసి అప్రూవల్ ఇస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీపీఎంఎస్ ద్వారా మాత్రమే ప్లాన్ అప్రూవల్ ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించడం వల్ల ఎదురయ్యే సమస్యలను కూడా ఇప్పటికే గుర్తించామన్నారు. అనధికార లే-అవుట్లు వేసే యజమానులు క్షేత్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడినా, ఇబ్బందులకు గురిచేసినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఏపీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అర్బన్ డెవలప్‌మెంట్‌పై అనేక అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డేవిడ్‌రాజు, బాలస్వామి, రాంబాబులను, లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.దొరబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. జంపన సుమన్‌వర్మ, గోపాలకృష్ణ, స్వర్ణకుమారి, కాలెపు కుమారస్వామి, డి.కామేశ్వరరావు, బాలకృష్ణ, కన్నబాబు, మలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల సక్రమ నిర్వహణకు పటిష్ట చర్యలు

యానాం ఎస్పీతో సమావేశమైన కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, మార్చి 7:

రానున్న సార్వత్రిక ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు, చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో యానాం ఎస్పీ రాజశేఖరన్‌తో పాటు ఎస్ఈబీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతమున్న చెక్‌పోస్టులకు అదనంగా మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కోరంగి పోలీస్‌స్టేషన్, యానాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన రోడ్లు, చిన్న రోడ్లలో ప్రస్తుం ఉన్న వాటికి అదనంగా మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణా నిరోధానికి యానాం, కాకినాడ జిల్లా పోలీసులు పటిష్టమైన సమాచార వ్యవస్థ, పరస్పర సమాచార మార్పిడితో అక్రమ రవాణాను అడ్డుకోవచ్చని... ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ శ్రీలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎస్‌డీపీవో హనుమంతరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వాడపల్లిలో ఘనంగా లక్ష తులసి పూజ



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చక స్వాములు

ఆత్రేయపురం, మార్చి 7:

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి పూజను గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. వైఖానస ఆగమం ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, అభిషేకాలు, హోమాలు, అమ్మవారికి కుంకుమార్చన అనంతరం లక్ష తులసి పూజ జరిపారు. మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించగా ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉప కమిషనరు, ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్‌లతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,60,192 లభించినట్టు ఈవో చెప్పారు.



లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

రెక్కీ నిర్వహించి..పక్కా ప్లాన్ వేసి..

ఉత్తరకంచిలో బ్యాంకు దోపిడీ నిందితుల అరెస్టు

కిలో బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


స్వాధీనం చేసుకున్న సొత్తు

కాకినాడ క్రైం, మార్చి 7: వేర్వేరు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి గత నెల 7వ తేదీన ప్రత్తిపాడు మండలం, ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్‌లో దోపిడీకి పాల్పడ్డారని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి దుప్పట్లు విక్రయించే వ్యాపారస్తుల మాదిరిగా లాడ్జి లో బస చేసి అక్కడ నుంచి ఫోన్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బ్యాంకులను గుర్తించి వాటి దోపిడీయే లక్ష్యంగా పక్కా పథకం అమలు చేస్తారని ఎస్పీ చెప్పారు. నెలరోజుల వ్యవధిలోనే చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి కిలో బంగారు ఆభరణాలు, రూ.1,19,700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన మరో ముగ్గురి నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయ, సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ వివరాలు అందించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ప్రత్యేక పర్యవేక్షణలో ట్రైనీ ఐపీఎస్ నవజ్యోతి మిశ్రా, ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్ సారథ్యంలో బృందాలుగా విడిపోయి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నిఘాను పటిష్టం చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పోలీస్ బృందాలు పెట్రోలింగ్ చేస్తుండగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు వ్యక్తులు తారాసపడ్డారు. వారిని అదుపులోకి తీసుకునే క్రమంలో ముగ్గురు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు. మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. ఉత్తరప్రదేశ్‌లోని బదానీ జిల్లా, బరాలీ మండలం, హస్పూర్ హరియా గ్రామానికి చెందిన 25 ఏళ్ల ధన్విర్ అలియాస్ గ్యాస్‌స్టౌవ్, అలియాస్ మేస్త్రీ, మహారాష్ట్ర, బుల్డాన్ జిల్లా, చిక్కిలి తాలుకా పింపుల్ గావ్ వుండా పోస్ట్, నైగావ్ గ్రామానికి చెందిన 25 ఏళ్ల అక్షయ్ గజానన్ అంబోర్, అదే ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల హరీష్ మిలింద్ గైక్వాడ్, మహారాష్ట్ర అమరావతి జిల్లా, ఎర్ల గ్రామానికి చెందిన 23 ఏళ్ల వైభవ్ నారాయణరావ్ అడోల్ తదితరులు మరో ముగ్గురితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి బ్యాంక్ చోరీకి పాల్పడ్డారన్నారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కొన్ని రోజుల ముందే రాష్ట్రానికి వచ్చి ఇక్కడ కొన్ని బ్యాంకుల వద్ద రెక్కీ చేసుకుని తిరిగి మహారాష్ట్రకు వెళ్ళి అక్కడ నుంచి ధన్విర్‌ను, అలాగే ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడిని తీసుకుని మండపేట చేరుకుని దుప్పట్ల వ్యాపారం నిమిత్తం వచ్చామని లాడ్జిలో రూం తీసుకున్నారు. అక్షయ్, వైభవ్, హరీష్, పరారీలో ఉన్న నిందితుడు కలిసి మండపేటలో ఓ బ్యాంకు దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించి అనువుగా లేకపోవడంతో మండపేటలో లాడ్జి ఖాళీ చేసి సామర్లకోటలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. గూగుల్ ద్వారా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి, ఎస్‌బీఐ బ్యాంక్ శాఖను దోపిడీ చేసేందుకు అనువైనదిగా గుర్తించారు. గత నెల 7న రాత్రి మొత్తం ఏడుగురు కలిసి ఉత్తరకంచి వచ్చి బ్యాంక్ చుట్టుపక్కల రెక్కీ చేసి నేరం చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉత్తరకంచి గ్రామ శివారుకు చేరుకుని హరీష్ అనే వ్యక్తిని కారు తీసుకుని వెళ్లిపోయి తిరిగి తెల్లవారు జామున నాలుగు గంటలకు రమ్మని చెప్పి మిగిలిన ఆరుగురు కారు దిగి పొలాల్లో నుంచి శ్మశానం మీదుగా రాత్రి ఒంటిగంట సమయంలో బ్యాంక్ వద్దకు చేరుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం బ్యాంక్ వెనుక కిటికీని కట్ చేసి బ్యాంక్ లోపలకి వెళ్లి గుమ్మం వద్ద ఉన్న అలారం వైర్‌లను అలాగే బ్యాంక్ సీసీ టీవీ వైర్లను కట్ చేసి బయట కిటికీల వద్ద వైభవ్ మరో నిందితుడిని కాపలాగా పెట్టి ధన్విర్, అక్షయ్, మరో నిందితుడు కలిసి బ్యాంక్‌లోకి వెళ్లగా ధన్విర్ మరో ఇద్దరు బ్యాంక్ స్ట్రాంగ్ రూం తాళాలు పగలగొట్టి అక్కడ ఉన్న నాలుగు లాకర్లలో రెండు లాకర్లను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ. 27,34,320 నగదును అలాగే సుమారు రూ.1,18,84,296 విలువైన మూడు కిలోల 280 గ్రాముల బంగారు ఆభరణాలను సంచులలో వేసుకుని బ్యాంక్‌లో బంగారు తూకం వేసే ఎలక్ట్రానిక్ త్రాసును, క్యాష్ కౌంటింగ్ మిషన్‌ను తీసుకుని గ్యాస్ సిలిండర్‌ను ఇతర సామగ్రిని బ్యాంక్‌లోనే వదిలివేసి బ్యాంక్ వెనుక నుంచి మెయిన్ రోడ్డు మీదకు వచ్చి తెల్లవారు జామున 4 గంటల సమయంలో కారు ఎక్కి సామర్లకోట వెళ్లిపోయినట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. అక్కడ బ్యాంక్ నుంచి తెచ్చిన ఎలక్ట్రానిక్ కాటాతో బంగారాన్ని తూచి, క్యాష్ కౌంటింగ్ మిషన్‌తో క్యాష్ లెక్కించి ఏడుగురు వాటాలు పంచుకుని 8 తేదీన రెండు బృందాలుగా విడిపోయి కారులో నలుగురు మహారాష్ట్రకు, ముగ్గురు రైలులో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అయితే పట్టుబడిన నలుగురు నిందితుల నుంచి రూ. 30,69,700 విలువైన కేజీ బంగారం, రూ.1,19,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితుల కోసం అలాగే మిగిలిన చోరీ సొత్తు రికవరీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారిని, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, పెద్దాపురం సీసీఎస్ సీఐ అంకబాబు, కాకినాడ సీసీఎస్ సీఐ చిట్టిబాబు, కాకినాడ ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సామర్లకోట సీఐ డి.సురేష్, టూటౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్, ఐటీ కోర్ సీఐ పి.శ్రీనివాస్, రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ, ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీం పనులకు మోదీ శంకుస్థాపన

వర్చువల్ విధానంలో కార్యక్రమాన్ని వీక్షించిన నేతలు, అధికారులు


వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అన్నవరం, మార్చి7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ 20.06 కోట్లకు సంబంధించిన పనులకు గురువారం ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఉదయం 11 గంటలకు రత్నగిరిపై రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారా అధికారులు, సిబ్బంది, భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఈఈ మూర్తి మాట్లాడుతూ రూ.11.50 కోట్లతో 50 వేల చదరపు అడుగులలో 1600 మంది ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించే విధంగా నూతన అన్నదాన భవనం ప్రస్తుత టీటీడీ సత్రం ప్రదేశంలో నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే అక్కడే భక్తులు వేచి ఉండేందుకు రూ.5.94 కోట్లతో క్యూకాంప్లెక్స్, రూ.61.85 లక్షలతో మరుగుదొడ్లు, స్నానపు గదులు, రూ.1.02 కోట్లతో 4 ఎలక్ట్రికల్ బస్సులు, రెండు చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీ గీత మాట్లాడుతూ ప్రసాద్ పథకం పనులకు మోదీ శంకుస్థాపన చేయడం ద్వారా జాతీయస్థాయిలో అన్నవరం ఆలయానికి మరింత గుర్తింపు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్, రాష్ట్ర టూరిజం అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా ముగిసిన మహారుద్రాభిషేకం

ఏలేరు నదిలో పార్థివ లింగాల నిమజ్జనం


ఏలేరు నదిలో లింగాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి7: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి పార్థివ లింగ మహారుద్రాభిషేకం ఘనంగా ముగిసింది. గురువారం ఉదయం 8.30 గంటలకు పూర్ణాహుతి గావించారు. శ్రీ శృంగేరి జగద్గురు కృప పోషిత మఠాధిపతి జగద్గురు పరమహంస, తుని తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి హాజరై పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని కోటి లింగాలను దర్శించుకున్నారు. అనంతరం లింగాలను భక్తులు ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని కోటి లింగాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీలు మాట్లాడుతూ ఆ శివుడి సంకల్పంతో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. అనంతరం వేలాదిగా వచ్చిన భక్తులందరికీ మహా అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, తుమ్మల బాబు, ఆకుల రామకృష్ణ, కోర్పు సాయితేజ, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, అడబాల రామాంజనేయులు, జీను మణిబాబు, మునిరెడ్డి నాగేశ్వరరావు, సుంకవిల్లి రాజు, దాపర్తి సీతారామయ్య పైడిపాల సూరిబాబు, జంపన రవివర్మ తరలివచ్చారు.


శివలింగానికి అభిషేకం చేస్తున్న సచ్చిదానంద సరస్వతి

స్వీట్ల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కడియం, మార్చి 7: కడియం మండలం దుళ్లలో గురువారం నాలుగు స్వీటు షాపులపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దత్తసాయి స్వీట్‌స్టాల్ యజమాని బాలసుబ్రహ్మణ్యం ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. అలానే లూజ్ పామాయిల్, మైసూర్‌పాక్ నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు. స్టాంప్ లేని 10 కిలోల తూకపు యంత్రాన్ని ఉపయోగిస్తున్నారంటూ లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. వెంకటసాయి స్వీట్ స్టాల్‌ను తనిఖీ చేయగా స్వీట్‌స్టాల్ యజమాని ఎస్.శ్రీను ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. బందరు లడ్డూ నమూనాను విశేషణ నిమిత్తం సేకరించారు. లక్ష్మీ స్వీటు స్టాల్‌ను తనిఖీ చేయగా యజమాని ఈ.నందీశ్వరరావు ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. సిరివైభవ స్వీట్-డైరీని తనిఖీ చేయగా యజమాని డి.శివ ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేవీఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వీటు స్టాల్స్, రెస్టారెంట్ పరిసరాలు, కిచెన్‌లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ తనిఖీలలో ముత్యాల నాయుడు, నాగవెంకటరాజు, భార్గవ మహేష్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఉన్నారు.

10న ఎస్ఏ పదోన్నతులకు అర్హులైన ఎస్జీటీలు హాజరుకావాలి

కాకినాడ రూరల్, మార్చి7: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్జీటీలుగా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక విద్య) పదోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 10న సర్వీస్ రిజిస్టర్, అర్హత సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని డీఈవో రమేష్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు.

ఆర్జిత సేవగా సత్యదేవుడి రథసేవ

పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం

అన్నవరం, మార్చి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు గురువారం పాలకమండలి ఆమోదం తెలిపింది. చైర్మన్ ఐ.వి రోహిత్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో పలు అంశాలను సభ్యులు ఆమోదించారు. ప్రధానంగా ప్రతి ఆదివారం నిర్వహించే సత్యదేవుడి రథసేవను ఆర్జితసేవగా నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి రూ.2500 టిక్కెట్టు ధరతో నలుగురికి ప్రవేశం కల్పించాలని తీర్మానించారు. రూ.34 లక్షలతో వనదుర్గ ఘాట్‌లో మట్టి పనిచేసేందుకు ప్రతిపాదన చేయగా కమిషనర్‌కు నివేదించాలని నిర్ణయించారు. ఇటీవల పిలిచిన పలు టెండర్లకు లోయస్ట్ ధరను ఆమోదించారు. దేవస్థానం కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల గంటల వ్యవధి వేతనం నుంచి కన్సాలిడేట్ చెల్లింపుగా మార్చాలని ప్రతిపాదించారు. సత్యదేవుడి బంగారు ధ్వజస్తంభం ప్రతిష్టించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు ఈనెల 18 నుంచి ప్రారంభించనున్నట్లు ఈవో సభ్యులకు తెలిపారు.

బ్యారేజ్‌పై ఇనుప గడ్డర్లు తొలగింపు

వాచ్‌మన్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు

కొవ్వూరు, మార్చి 7 : విధి నిర్వహణలో ఉన్న వాచ్‌మన్‌ను కొట్టి, చంపుతానని బెదిరించిన 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బొర్రా సత్యనారాయణ విజ్జేశ్వరం బ్యారేజ్‌పై వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన తండ్రికి సహాయకుడిగా బొర్రా సత్తిబాబు వాచ్‌మన్ డ్యూటీకి వచ్చాడు. అర్ధరాత్రి 12-30 గంటల సమయంలో బొబ్బర్లంక, మద్దూరులంక గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు బ్యారేజ్‌పైకి వచ్చి విజ్జేశ్వరం బ్యారేజ్‌పై భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటుచేసిన ఇనుప గడ్డర్‌ను తొలగించి పక్కనే ఉన్న నీటిలో పడవేశారు. అడ్డువచ్చిన సత్తిబాబును కొట్టి, చంపుతామని బెదిరించారు. దీనిపై సత్తిబాబు కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ వై. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నిడదవోలు, మార్చి 7: నిడదవోలు చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 35 సంవత్సరాల వయస్సు గల యువకుడు మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. యువకుడి ఒంటిపై తెలుపురంగు కట్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉందని చెప్పారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని గుర్తించిన వారు లేదా సమాచారం తెలిసిన వారు 9490617090, 7013360296కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

313 కిలోల గంజాయి స్వాధీనం

దేవరపల్లి, మార్చి 7: గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. సెబ్ డీఎస్పీ కె.జయమౌనిక వివరాలు వెల్లడించారు. కొవ్వూరు నుంచి గోపాలపురం వైపు వెళ్తున్న లారీలో 313 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సెబ్ బ్యూరో రవిప్రకాశ్, సెబ్ ఎస్పీ మహేశ్వరరాజు, సెబ్ డీఎస్ఈవో పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హరియాణాకు చెందిన గూడ్స్ లారీ భువనేశ్వర్ లోడు వేసుకుని వెళ్లి అక్కడ దిగుమతి చేసుకుని తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరంలో 313 కిలోల గంజాయిని క్యాబిన్‌లో వేసుకుని వస్తుండగా లారీని గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను తారీఫ్, ముస్తాఫాను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ కేవీ స్వామి, ఎస్ఐ సుధీర్, డీటీఎఫ్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం


ఐక్యత చాటుతున్న నాయకులు

కొత్తపేట, మార్చి7: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటే నిలిచిన శెట్టిబలిజలకు చట్టసభలలో ప్రాధాన్యం కల్పించాలని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో రాష్ట్ర టీడీపీ శెట్టిబలిజ సాధికార కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శెట్టిబలిజల సాధికారత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకూ ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో శెట్టిబలిజలకు స్థానం లేకపోవడం ఆవేదన కలిగించిందని, అధికార వైసీపీ మూడు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి వెన్నంట ఉండే శెట్టిబలిజలకు రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని కోరారు. అది వీలుకానప్పుడు నామినేటెడ్ పదవులలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం ఇస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వాలన్నారు. రామచంద్రపురం టీడీపీ టిక్కెట్టు సుబ్రహ్మణ్యంకు కేటాయించాలని శెట్టిబలిజ నాయకులు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, కేతా శ్రీను, కాదా వెంకటరమణ, చెల్లబోయిన శ్రీను, మొల్లేటి శ్రీను, మల్లుల పొలయ్య, మేడిశెట్టి సూర్యనారాయణ, పితాని వీరభద్రరావు, గుత్తుల పట్టాభిరామారావు, యల్లమిల్లి జగన్మోహన్, కముజు వెంకటేశ్వరరావు, మట్టపర్తి రాజేశ్వరరావు, మట్టపర్తి అచ్యుత్, వనుము వీరబ్రహ్మం, గుబ్బల మూర్తి, కడలి వెంకటేశ్వరరావు, చొల్లంగి వీరబాబు పాల్గొన్నారు.



సూక్ష్మ శివలింగం


సత్యనారాయణ

మండపేట, మార్చి 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సూక్ష్మ వస్తువుల తయారీదారుడు అండలూరి వీరవెంకట సత్య నారాయణ శివరాత్రిని పురస్కరించుకుని గురువారం జాతి మరకత పచ్చతో మూడు గంటలు శ్రమించి అతి చిన్న సైజులో సూక్ష్మ శివలింగాన్ని తయారు చేశాడు. ఆయనను పలువురు అభినందించారు.

వైసీపీలోకి ముద్రగడ పద్మనాభం

ఈ నెల 14-17 మధ్యలో ఏదో ఒకరోజు ముహూర్తం


ముద్రగడను కలిసిన మిథున్‌రెడ్డి

కిర్లంపూడి, మార్చి 7: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరడం ఖాయమైపోయింది. ఈనెల 14 నుంచి 17వ తేదీ మధ్యలో తాడేపల్లిలో జగన్ సమక్షంలో ముద్రగడ వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు ఆయనను పార్టీలోకి ఆహ్వానిస్తూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లారు. ఆయనతో చాలాసేపు చర్చలు జరిపారు. సీఎం జగన్‌తో సూచనల మేరకు పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చినట్టు వారంతా వివరించారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల అనంతరం వైసీపీలో చేరేందుకు ముద్రగడ అంగీకరించారు. అయితే తేదీ ఏదనేది అధికారికంగా వైసీసీ, ముద్రగడ వర్గం ధ్రువీకరించాల్సి ఉంది. భవిష్యత్తులో రాజ్యసభ, ప్రస్తుతానికి ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ముద్రగడ తనయుడికి కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చేలా గురువారం చర్చలు జరిగినట్టు తెలిసింది. ముద్రగడతో భేటీ అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముద్రగడను సీఎం జగన్ వైసీపీలోకి ఆహ్వానించారని, అందుకే తాము వచ్చినట్టు చెప్పారు. సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన మంచి నిర్ణయం ప్రకటిస్తున్నారని ఆశిస్తున్నామన్నారు. ముద్రగడకు ఏ ఆఫర్ ఇవ్వలేదన్నారు. ముద్రగడ పార్టీలోకి వస్తే జగన్ ఆయనకు సముచిత స్థానం కల్పిస్తారని చెప్పారు. మిథున్‌రెడ్డి వెంట కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, వైసీపీ జగ్గంపేట, పెద్దాపురం ఇన్‌చార్జిలు తోట నరసింహం, దవులూరి దొరబాబు, వైసీపీ నాయకుడు జక్కంపూడి గణేష్ ఉన్నారు.

విద్యుత్ వెలుగుల్లో పాదగయ



పిఠాపురం, మార్చి 7: పాదగయ క్షేత్రం విద్యుత్ కాంతుల వెలుగులతో కాంతు లీనుతోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన, ఉప ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాదగయకు వెళ్లే ప్రధాన రహదారుల్లోనూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

పాదగయ క్షేత్రంలో నేడు

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి స్వామి నిజరూప దర్శనం, ఉదయం 6 గంటలకు కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన, ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు సదస్యము, పండిత సభ సాయంత్రం 6.00 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటల నుంచి స్వామికి లింగోద్భవ కాలాభిషేకం, అర్ధరాత్రి దాటిన తర్వాత నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.



వారసత్వం కోసం కాపుజాతిని తాకట్టు పెట్టొద్దు

కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు


మాట్లాడుతున్న పురంశెట్టి మంగారావు

అమలాపురం టౌన్, మార్చి 7: వారసత్వ, స్వార్థ ప్రయోజనాల కోసం కాపుజాతిని తాకట్టు పెట్టవద్దని కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు హెచ్చరించారు. కాపు నాయకులు చేగొండి హరిరామజోగయ్య, ముద్రగడ పద్మనాభం వారి వారసత్వ రాజకీయ ప్రయోజనాల కోసం స్వార్థ రాజకీయాలకు తెరదీశారని విమర్శించారు. అటువంటి నాయకులను కాపు అనుబంధ కులాలు అనుసరించే ప్రశ్నే లేదన్నారు. డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువారం కాపునాడు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాపు కులస్తులను ఓటు బ్యాంకులుగా చూడవద్దని సూచించారు. కాపులను వెనుకబడినతరగతులుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించే సత్తా ఉన్న రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. కాపునాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ మాట్లాడుతూ వెనుకబాటు తనంతో మగ్గుతున్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు ఉపకులాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలన్నారు. 20 అంశాలతో కూడిన డిక్లరేషన్‌ను ఆయన విడుదల చేశారు. కాపునాడు నాయకులు పత్తి దత్తుడు, గంగుమళ్ల శ్రీనివాస్, త్సవటపల్లి నాగు, ఉంగరాల అబ్బులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తత కోసం మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, మార్చి 7: తమ్మవరంలో ఎస్‌సీఎస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పనసపాడులో దేవీ ఫిషరీస్ పరిశ్రమలో అమ్మోనియా వాయువు లీకేజీ అయితే ఎటువంటి రక్షణ, సహాయక చర్యలు తీసుకుంటారో వివరిస్తూ గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ మాక్‌డ్రిల్‌కు సంబంధించిన వివరాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర జిల్లా విపత్తుల నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న అమ్మోనియా పరిశ్రమలు సుమారు 30 ఉన్నాయన్నారు. అలాగే మోటారు స్పిరిట్ వినియోగించే పరిశ్రమలు అధికంగా ఉన్నాయన్నారు. మాక్ డ్రిల్ నిర్వహిస్తే భద్రత, రక్షణ ఇతర ప్రమాణాలు మెరుగ్గా ఉంటుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మాక్ డ్రిల్‌లో గమనించిన అంశాల ఆధారంగా విపత్తు నియంత్రణ సంసిద్ధతపై యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఎస్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కట్టా సాంబయ్య, తహశీల్దార్ ఏడీ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి సురేంద్ర ఆనంద్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, పొల్యూషన్ ఈఈ ఎన్.సందీప్, దేవీ ఫిషరీస్, ఎస్‌సీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

అంతర్వేది, మార్చి 7: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాఘమాసం బహుళ ద్వాదశి పర్వదినాన స్వామి-అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి ప్రత్యేక అలంకరణ నడుమ అర్చకులు కల్యాణ తంతు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

అమలాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మానవజాతి మనుగడకు ప్రాణం పోస్తున్న మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో స్వావలంబన సాధించడంతో పాటు అన్ని రంగాల్లోనూ పురోగమించాలని అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరేష్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ నుంచి మహిళల హక్కుల పట్ల అవగాహన పెరగాల్సి ఉందన్నారు. మహిళా శక్తి ఎంతగా పురోగమిస్తోందో జిల్లా రెవెన్యూ అధికారి వెం.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు వివరించారు. అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి మహిళల హక్కులను వివరించారు. అనంతరం వివిధ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడా రంగంలో రాణిస్తున్న వెటరన్ క్రీడాకారిణి మహబూబ్ షాహీరాను సత్కరించారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్, సీడీపీవోలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాఘ్రేశ్వరంలో అగ్నిష్టోమ యాగం

అంబాజీపేట, మార్చి 7: వ్యాఘ్రేశ్వరలో ఆకెళ్ళ రామకృష్ణ సోమయాజి దంపతుల ఆధ్వర్యంలో ఈనెల11 నుంచి 15వరకు అగ్నిష్టోమ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వ్యాఘ్రేశ్వరంలో గతంలో ఈయాగాన్ని 1968, 1969 లోకకల్యాణార్థం నిర్వహించారు. ఆకెళ్ళ రామకృష్ణ సోమయాజి దంపతులతో 2008లో అగ్నిష్టోమ యాగం నిర్వహించామన్నారు.

గోడితిప్పలో డ్రైన్ వివాదం కొలిక్కి

అల్లవరం, మార్చి7:గోడితిప్పలో డ్రైన్‌ఏర్పాటుపై రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. టీడీపీ నాయకురాలు కొల్లు దుర్గ, వైసీపీ నాయకుడు బొంతు సత్తిబాబు మధ్య డ్రైన్ ఏర్పాటుపై వివాదం నెలకొంది. పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా డ్రైన్ ఏర్పాటు చేస్తున్నారంటూ దుర్గ అడ్డగించింది. ఏఎస్‌ఐ జంగా సత్యనారాయణ, అధికారులు, పెద్దలు జోక్యం చేసుకోవడంతో వివాదం కొలిక్కివచ్చింది. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, చిట్టినీడి శ్రీనివాస్, కర్రి వెంకటరామరాజు, నాతి శ్రీనివాసరావు, సందాడి శ్రీనివాస్, కొప్పాడి వెర్రియ్య, ఈవోపీర్డీ ఎస్వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల పోలీసు కవాతు

కపిలేశ్వరపురం, మార్చి 7: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని వల్లూరు, వడ్లమూరు, కాలేరు గ్రామాల్లో గురువారం కేంద్ర బలగాలతో పోలీసకవాతు నిర్వహించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగర ఎస్ఐ ఎ.వరదేశి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

మండపేట, మార్చి 7: ఇప్పనపాడకు చెందిన వర్రె సుబ్రహ్మణ్యం, పితాని నాగేశ్వరరావు, నరాలు సుబ్బారావు, చోడ పాపారావు నేతృత్వంలో గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కిట్స్‌లో హెల్త్ సైన్సు విద్యార్థుల ఫ్రెషర్స్‌డే

ద్రాక్షారామ, మార్చి 7: కిట్స్ ఇంజనీరింగ్, రాజరత్న నర్సింగ్ కాలేజీలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా లేంప్ లైటనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ హేమసుధీర్, ఏరియా ఆసుపత్రిపీపీ యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సీఎస్‌బీకే హరీష్, కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.బి.అంకం పాల్గొన్నారు. ఇటీవల పల్స్‌పోలియోలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. డైరెక్టర్ పవన్ అనంతరం హెల్త్ సైన్సు విద్యార్థులు ప్రెషర్స్‌డే వేడుకలు జరిపారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన

ముమ్మిడివరం, మార్చి 7: ఎన్నికల్లో ఉపయోగించే ఓటింగ్ యంత్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మధుసూదన్ సూచించారు. ముమ్మిడివరం ఎంజీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నియోజకవర్గ పరిధిలో గల 268 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. ఈసదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మాస్టార్ ట్రైనీలు తొలుత ఓటింగ్ యంత్రాల పనితీరును వారికి విశదీకరించారు. ఆర్వో మధుసూదన్ మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు అధికారులు సహకరించాలన్నారు. ఏఆర్వో శ్రీనునాయక్, ఎన్నికల అధికారులుపాల్గొన్నారు.

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం




కపిలేశ్వరపురం: ఎమ్మెల్యే వేగుళ్ల, హరీష్‌మాధుర్ ఎన్నికల్లో విజయం సాధించాలని ప్రార్థన చేస్తున్న నల్లా పల్లమ్మ, ముమ్మిడివరం: టీడీపీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, మార్చి7: వైసీపీ అరాచకపాలనతో విసుగుచెందిన ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. గురువారం అద్దంకివారిలంకలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ టీడీపీ-జనసేన ప్రవేశపెట్టిన మినీమేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకువివరించారు. గ్రామంలో పర్యటించిన వారికి ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతూ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక: అంగరకు చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పుత్సల శ్రీను ఆధ్వర్యంలో పార్టీలో చేరిన గుత్తుల శ్రీను, గుత్తుల సత్యనారాయణ, కడియాల త్రిమూర్తులు, అనుసూరి రాము, గుత్తుల వెంకటరమణ, మేడిశెట్టి వీరవెంకటసత్యనారాయణ, గుత్తుల గోవిందు, సూరంపూడి లావణ్య, గుత్తుల సునీత, పితాని సత్యవేణి, లంక ధనకొండలకు ఎమ్మెల్యే వేగుళ్ళ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బొల్లోజు నాని, త్రిపురశెట్టి నాని, మత్సాల గంగరాజు, శాంతి రమేష్, షేక్ కరీం, గొంద్రోతుల పట్టాభి, చింతా అప్పన్న, పెంకే కొండ, సూరంపూడి మారుతీ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ క్యాలెండర్ల పంపిణీ

ఆత్రేయపురం, మార్చి 7: కొత్తపేట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ టీడీపీ, జనసేన శ్రేణులు మండలంలోని 17 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం చేశారు. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించి సూపర్ సిక్స్ పథకాలతో రూపొందించిన క్యాలెండర్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, మాజీ సర్పంచ్‌లు మద్దూరి సుబ్బారావు, బి.పుల్లంరాజు వర్మ, సర్పంచ్ మెర్ల రాము, జుజ్జవరపు హరిబాబు, మెర్ల నాగేశ్వరరావు, వెంకన్న, అధిక సంఖ్యలో తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలి

ముమ్మిడివరం, మార్చి 7: భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు, రాష్ట్ర అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ, జనసేన ముమ్మిడివరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 10,11వార్డుల్లో గురువారం ఆయన పార్టీ, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ మేనిఫెస్టో బ్రోచర్లను ఓటర్లకు అందించారు. తొలుత కొండాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. నగర పంచాయతీ మాజీ కౌన్సిలర్ కుడుపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు పార్టీలోకి చేరగా కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట గుత్తుల సాయి, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, ధూలిపూడి బాబి, అర్ధాని శ్రీనివాసరావు, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, అడబాల సతీష్‌కుమార్, కట్టా సత్తిబాబు, మాదాల నాగసత్యమంగాకుమారి, దివి మహాలక్ష్మి, దాట్ల బాబు, సానబోయిన సోమయ్య, దున్నాల నాగమణి, కుడుపూడి మల్లేశ్వరి, చిక్కాల అంజి, గొల్లపల్లి గోపి, విళ్ల వీరాస్వామినాయుడు, మిమ్మితి చిరంజీవి, యాళ్ల ఉదయ్, బొక్కా రుక్మిణి, చింతపల్లి రాజు, లోకినీడి వెంకటేశ్వరరావు, సాకా సీతాదేవి, రెడ్డి బాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళా పోలీసుపై చర్యలు తీసుకోవాలని ధర్నా

రామచంద్రపురం, మార్చి 7: వెల్లలో మహిళా పోలీసు వేధింపులు ఆపాలని, ఆమెపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం అంగన్వాడీలు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, జిల్లా కార్యదర్శి దుర్గమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ వెల్లలో అంగన్వాడీ వర్కర్‌గా పనిచేస్తోన్న బి.అమ్మాజీపై మహిళా పోలీసు పి.ఉమామహేశ్వరి వేధింపులకు గురిచేస్తుందన్నారు. గురువారం ఉమామహేశ్వరి అంగన్వాడీ సెంటర్‌కు వెళ్లి అంగన్వాడీ వర్కర్‌ని కులం పేరుతో దూషించి, ఆమెపై దాడికి పాల్పడిందన్నారు. మహిళా పోలీసు ఉమామహేశ్వరిని సస్పెండ్ చేయాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

భయపడకుండా ఓటు హక్కు వినియోగించుకోండి

ఉప్పలగుప్తం, మార్చి 7: శాంతి భద్రతలకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా మేమున్నాం, ఎక్కడ ఏ సంఘటన జరిగినా క్షణాల్లో వచ్చి రక్షణగా నిలబడతాం, ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాలతో అమలాపురం రూరల్ సీఐ వీరబాబు, ఉప్పలగుప్తం ఎస్ఐ కె.మనోహర్‌జోషీ ఆధ్వర్యంలో చల్లపల్లి, ఎస్.యానాం, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బృందాలు గురువారం కవాతు నిర్వహించాయి.

పారిశుధ్య నిర్వహణపై టీడీపీ ధ్వజం

మండపేట, మార్చి7:మండపేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని టీడీపీ కౌన్సిలర్ చుండ్రు చినసుబ్బారావు ధ్వజమెత్తారు. మున్సిపల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన గురువారం జరిగింది. 15వఆర్థిక సంఘానికి సంబంధించి రెండో విడత మంజూరైన రూ.72.75లక్షలతో 8పనులను అజెండాలో పొందుపరచగా కౌన్సిల్ ఆమోదించింది. దోమలు నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ చెప్పారు.కమిషనర్ బి.రాము. మున్సిపల్ ఇంజనీ రింగ్ డీఈఈ శ్రీనివాస్, ఆర్ఐ ప్రభాకరచౌదరి పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న బుంగ సంజయ్‌మాదిగ

రావులపాలెం, మార్చి 7: మాదిగలకు రాజకీయ పార్టీలు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ అన్నారు. రావులపాడు వద్ద గురువారం రాత్రి సంజయ్‌మాదిగ ఆధ్వర్యంలో మాదిగల రాజకీయ చైతన్య సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలను రాజకీయంగా వాడుకోవడం తప్ప సీట్లు కేటాయింపులో అన్యాయం జరుగుతుందన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా నరేంద్రమోదీ హామీ ఇచ్చి డ్రామాలు ఆడారన్నారు. మాదిగలకు రాజకీయ అవకాశం కల్పించాలి, 18ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు కచ్చితంగా రాజకీయ పార్టీలు కేటాయించాలన్నారు. మాదిగల వర్గీకరణ కోసం దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. వివిధ పార్టీలు, నాయకులు కేవలం మాదిగల ఓటు బ్యాంకు చూస్తున్నారే తప్ప వర్గీకరణ అంశంపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారన్నారు. మాదిగ, మాదిగల ఉపకులాలు రాజకీయంగా చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అక్రమ సోదాలను నిరసిస్తూ జనసేన రాస్తారోకో



పోలీసుస్టేషన్ ఎదుట రాజబాబు ఆధ్వర్యంలో జనసైనికుల నిరసన

అమలాపురం టౌన్, మార్చి 7: జనసేన కేంద్ర కార్యాలయ సిబ్బంది నివాసం ఉంటున్న అపార్టుమెంట్లలోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి అక్రమంగా సోదాలు నిర్వహించడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలను, పోలీసుల దౌర్జన్యాలను వివరిస్తూ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల అధికారంలో ఉండే ప్రభుత్వానికి పోలీసు అధికారులు వత్తాసు పలకడం దారుణమన్నారు. రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని, పోలీసు అధికారులు విజ్ఞతతో వ్యవహరించాలని రాజబాబు సూచించారు. జనసేన నాయకులు సూదా చిన్నా, ముత్యాల మణి, మహదశనాగేశ్వరరావు, పిండి రాజాతో పాటు వందలాది మంది పాల్గొన్నారు.

సొంత ఇంటి కల నెరవేర్చడమే ధ్యేయం

ముమ్మిడివరం, మార్చి 7: సీఎం జగన్ పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం అర్బన్‌లో 1123 మంది లబ్ధిదారులకు, రూరల్‌లో 1557మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌లు, రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, కోలా బాబ్జి, రెడ్డి శివన్నారాయణ, మట్టపర్తి సత్యనారాయణ, వరసాల రమాదేవి, పాము చిట్టిబాబు, రెవెన్యూ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టం ప్రకటనపై సుభాష్ హర్షం



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు వాసంశెట్టి సుభాష్

రాజోలు, మార్చి 7: మంగళగిరిలో ఈనెల5న జరిగిన బీసీ డిక్లరేషన్ మహాసభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని ప్రకటించడంపై టీడీపీ నాయకుడు వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. తాటిపాకలో ఎంపీపీ కేతా అధ్యక్షతన జరిగిన గురువారం జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50ఏళ్లకే రూ.4వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తగ్గించిన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 34శాతం పెంచుతామని ప్రకటించారని తెలిపారు. గీత ఉపకులాలకు లిక్కరు లైసెన్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2014-19 టీడీపీ హయాంలో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.31వేల కోట్లు ఖర్చు చేశామని గర్వంగా చెబుతున్నారన్నారు. వైసీపీ హయాంలో బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లు పక్కదారికి మళ్లించారని, డమ్మీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని సుభాష్ విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, ర్యాలి పట్టాభిరామయ్య, కడలి నారాయణ, చిట్టూరి సంతోష్, వైదాని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం చెక్కు అందజేత



మత్స్యకారుల పరిహారం నిధిని చెక్కును మల్లాడికి అందిస్తున్న సీఎం రంగసామి, మంత్రి లక్ష్మీనారాయణ

యానాం, మార్చి 7: యానాం నియోజకవర్గంలో మత్స్యకారులకు ఓఎన్జీసీ పరిహారం చెక్కును సీఎం ఎన్.రంగసామి, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ నుంచి గురువారం ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అందుకున్నారు. 15నెలలకు సంబంధించి రూ.90.54కోట్ల చెక్కును 5,289మంది లబ్ధిదారులకు పరిహారం అందింది. ఒక్కొక్కరికి రూ.1.72లక్షలు వచ్చింది. గురువారం ఇండియన్ బ్యాంకు ఖాతాదారుల ఖాతాల్లో పరిహారం జమైంది. మిగిలిన ఇతర బ్యాంకు ఖాతాదారులకు శుక్రవారం జమకానుంది.

పోరాటం ఫలితం: మల్లాడి: జనవరి 2023న ఓఎన్జీసీ సంస్థతో పుదుచ్చేరి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు యానాంలోని 5,289మందికి ఒక్కొక్కరికి మొదటి విడతగా రూ.1,72,500 చొప్పున నగదు విడుదలైంది. మత్స్యకారులకు పరిహారం అందకుండా ఫిర్యాదులతో అనేకమంది అనేక అడ్డంకులు సృష్టించినా అన్నింటిని దాటుకుని పరిహారం సాధించామన్నారు. ఈసందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రంగసామి, మంత్రి లక్ష్మీనారాయణ, పుదుచ్చేరి, యానాం ఉన్నతాధికారులకు నష్టపరిహారం లబ్ధిదారుల తరుపున మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన 173మందికి మళ్లీ విచారణ చేపట్టి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గౌతమి కైలాసభూమి ప్రారంభోత్సవం

అయినవిల్లి, మార్చి7: ముక్తేశ్వరంవృద్ధ గౌతమితీరంలో దాత నంబూరి వెంకన్నబాబురాజు రూ.30లక్షలతో అభివృద్ధి చేసినశ్రీముక్తిగౌతమి కైలాసభూమిని గురువారం ప్రారంభించారు. శివుని 18అడుగులవిగ్రహాన్ని నిర్మించారు. దాతను గ్రామస్తులు సత్కరించారు. సర్పంచ్ కాకర శ్రీనివాస్, సిద్ధివినాయక ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు పాల్గొన్నారు.

బోడసకుర్రును దత్తత తీసుకోవాలని ఓఎన్జీసీ ప్లాంటు వద్ద గ్రామస్తుల ధర్నా

అల్లవరం, మార్చి7: కేజీ బేసిన్ పరిధిలోని అల్లవరం మండలం బోడసకుర్రు అభివృద్ధిలో ఓఎన్జీసీ, గెయిల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ దేవర్లంకలోని ఓఎన్జీసీ ప్లాంటు గేటు వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు(దత్తుడు), చింతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 30ఏళ్లగా కోట్లాది రూపాయల చమురు, సహజవాయివు ఉత్పత్తులు తరలించుకుపోతూ రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే ఓఎన్జీసీ కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఓఎన్జీసీ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, బోడసకుర్రు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని, విద్య వైద్యం, తాగునీరు, రోడ్లు, తుఫాన్ షెల్టర్లు, స్థానిక యువతకు ఉపాధి, సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఓఎన్జీసీ అధికారులు వచ్చి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అరవా చంటి, గెల్లి మహాదేవబాబు, ఐలా నాగేశ్వరరావు, మొయిల గణపతి, కొప్పాడి దుర్గారావు, చింతా బాబ్జీ, దొమ్మేటి రామకృష్ణ, ముత్యాల బాబి, రొక్కాల నాగేశ్వరరావు, రేళ్ళ అంజిబాబు, ఎం.దుర్గారావు, చింతం శ్రీను ఆందోళనలో పాల్గొన్నారు. ఈసమయంలో రాజమహేంద్రవరం రావాలని ఓఎన్జీసీ నుంచి పిలుపు రావడంతో వారు బయలుదేరి వెళ్లారు.

12న ఉపాధి కార్యాలయం వద్ద జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 7: అమలాపురంలోని ఉపాధి కార్యాలయం వద్ద ఈనెల12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి యి.వసంతలక్ష్మి తెలిపారు. ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, భారత ఫైనాన్సియల్ ఇన్‌క్లూజన్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ల్లో వివిధ విభాగాల్లో పనిచేసేందుకు పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదువుకున్న అభ్యర్థులు అర్హులన్నారు. రూ.8వేల నుంచి రూ.25వేల వరకు వేతనం అందజేస్తారు. అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థులు 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో ఉపాధి కార్యాలయానికి చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8121838392 నెంబరులో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

అమలాపురం రూరల్, మార్చి 7: సమనసలో ఎంపీ ల్యాడ్స్, ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లను మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.30.60లక్షలతో ఓహెచ్‌ఎస్సార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అమలాపురంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ప్రారంభించారు. 272మంది లబ్ధిదారులకు రిజిస్టర్ చేసిన పట్టాలను పంపిణీ చేశారు. బండారులంకలో ఆర్బీకేను ప్రారంభించి రోడ్లకు భూమి పూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, కమిషనర్ ఎస్.మనోహర్‌పాల్గొన్నారు.

భాష్యం జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

అమలాపురం టౌన్, మార్చి 7: సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని అమలాపురం భాష్యం స్కూలులో జిల్లా అధికారి జవ్వాది వెంకటశ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం జోనల్ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అమలాపురం, కొత్తపేట, మండపేట, రావులపాలెం, తాటిపాక, ముమ్మిడివరం, మలికిపురం శాఖలకు చెందిన భాష్యం విద్యార్థులు 150కు పైగా నమూనాలను ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం న్యాయనిర్ణేతగా వ్యవహరించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 117మందికి ఉద్యోగాలు

పి.గన్నవరం, మార్చి 7: పి.గన్నవరం లక్ష్మి ఐటీఐలో ఆంధ్రప్రదేశ్ స్కిల్‌డెవలప్‌మెంట్ ద్వారా గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 15కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి పి.లోకేష్‌మాన్ తెలిపారు. ఇంటర్వ్యూలకు 346మంది హాజరు కాగా 117మందికి ఉద్యోగాలు లభించినట్లు తెలిపారు. మరో 80మందిని వెయిటింగ్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు. జాబ్‌మేళా ఏర్పాట్లను స్కిల్‌డెవలప్‌మెంట్ సిబ్బంది ఒ.నాగబాబు, పి.గన్నవరం కోఆర్డినేటర్ కె.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు. జాబ్‌మేళాను నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి ఈ.వసంతలక్ష్మిలు పరిశీలించగా సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ పులపర్తి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మలికిపురం, మార్చి7: కేశనపల్లిలో రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.23లక్షలతో నిర్మించిన ఏఎంసీ రోడ్లను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. సర్పంచ్ యెనుముల నాగు, ఏఎంసీ చైర్మన్ రోజారమణి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, యెనుముల నారాయణస్వామి పాల్గొన్నారు.

పలివెల, మందపల్లి స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు

కొత్తపేట, మార్చి 7: మందపల్లి ఉమామందేశ్వర, ఉమాబ్రహ్మేశ్వర, ఉమానాగేశ్వరస్వామివార్ల దివ్యకల్యాణ మహోత్సవాలు, పలివెల శ్రీఉమాకొప్పేలింగేశ్వరస్వామి వార్ల దివ్యకల్యాణాలు గురువారం తెల్లవారుజామున ఆయా అర్చకులు, పండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో విద్యుత్, పుష్పాలంకరణ, బాణసంచా కాల్పులతో కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దివ్యకల్యాణాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా పాలకమండలిలు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ఆత్రేయపురం, మార్చి 7: వెలిచేరుకు చెందిన చిట్టిమేను శ్రీనివాస్ ఈనెల4న కాలువ రేవు వద్దకు వెళ్లి అదృశ్యమయ్యాడు. దీనిపై పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి ఆత్రేయపురం కాలువ రేవులో శ్రీనివాస్ మృతదేహం లభ్యం కాగా పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్ బీఆర్క్ పరీక్షలో మోడరన్ విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం, మార్చి7: జేఈఈ మెయిన్స్ బీఆర్క్ పరీక్షా ఫలితాల్లో మోడరన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విద్యార్థులు కె.సుహర్షిత్ 99.49, ఎన్. సంతోష్ 97.54పర్సంటైల్ సాధించి బీఆర్క్‌లో జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారని మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జి.వి.రావు తెలిపారు. ఇంటర్ ప్రిన్సిపాల్ సీహెచ్.రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ కనబరచడం మోడరన్ కాంపిటేటివ్ సెల్ విశేష కృషి చేసిందన్నారు. ఇంటర్ వైస్‌ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్, సీహెచ్.శ్రీనివాస్,సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై పీవోలు అవగాహన కలిగిఉండాలి

పి.గన్నవరం, మార్చి 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి పీవో విధిగా ఈవీఎంలపై అవగాహన కల్గి ఉండాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీవోలకు ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15మంది మాస్టర్ ట్రైనర్స్ 300 మంది పీవోలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. తహసీల్దార్లు ఎస్కే హుస్సేన్, డిఎల్ ప్రమద్వారా, విమలకుమారి, ఎం.మేరికమ్మ, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో ఉన్న హామీలన్నీ నెరవేరుతాయి

పి.గన్నవరం, మార్చి7: టీడీపీ-జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన ప్రతిఅంశాన్ని ఉమ్మడి ప్రభుత్వం నెరవేరుస్తుందని టీడీపీ నియోజకవర్గ బీసీ నేతలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తంచేస్తూ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు మట్టపర్తి రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందన్నారు. దాసరి వీరవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, కొండా జగదీష్, పెచ్చెట్టి వెర్రియ్య, శేరు శ్రీనుబాబు, గుడాల పణి, పరమట సత్యనారాయణ, ఒంటరిపాటి విఘ్నేశ్వరుడు, అర్గాని ఏడుకొండలు, కుడిపూడి బుజ్జి, లంకే చిరంజీవి, పితాని రాంబాబు, లంకే భీమరాజు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

మలికిపురం, మార్చి 7: జీవితంలో ప్రతీ వ్యక్తి ఉన్నత స్థాయికి వెళ్లాలని అనుకుంటాడని, దానికి తగిన విధంగా ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు వెళ్తారని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫొటోగ్రఫర్, స్పానిష్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బీర అశోక్ అన్నారు. విశ్వేశ్వరాయపురం వివేకానంద ఆంగ్ల పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ దేశాల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాల గొప్పదనాన్ని వివరించారు. కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సప్తమ వార్షికోత్సవం

మలికిపురం, మార్చి 7: మలికిపురం చంటిరాజు విల్లాస్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి సప్తమ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం, తామర పుష్పాలతో విశేష పూజ, పుష్పోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కేవీ చంటిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో శ్రీమాన్ ఖండవల్లి సూర్యసత్యనారాయణాచార్యులు, పెద్దింటి సాయిలక్ష్మణరవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

ముమ్మిడివరం, మార్చి 7: మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముమ్మిడివరంలోని మంజీరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మహిళలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్టు ఆసుపత్రి వైద్యురాలు మంజీరా తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4నుంచి 7గంటల వరకు వైద్య సేవలందిస్తామన్నారు.

సామాజిక సేవలో నామన ఫౌండేషన్

మామిడికుదురు, మార్చి 7: సామాజిక సేవ చేయడానికి నామన ఫౌండేషన్‌ను ప్రారంభించినట్టు ఫౌండర్ నామన వినోద్ తెలిపారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు చైర్మన్‌గా ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య రంగాల్లో సహాయం అందిస్తామన్నారు. మగటపల్లిలో త్వరలో చిన్న ఆసుపత్రి ప్రారంభించి ఎంజియోగ్రామ్, ల్యాబ్ పరీక్షలు చేస్తామన్నారు. గురువారం నామన రాంబాబు సతీమణి కృష్ణవేని జ్ఞాపకార్థం పేదలకు దుస్తులుపంపిణీ చేశారు. బొలిశెట్టి రాంబాబు, తిరుమల శ్రీనివాస్, బొలిశెట్టి మాధవ, వద్దే సంపత్, పి.మురళీకృష్ణ, బొలిశెట్టి నరసింహారావు, డాక్టర్ నామన శృతి పాల్గొన్నారు.

కాపునాడు ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షుడిగా నంద్యాల



అమలాపురం టౌన్/కాట్రేనికోన, మార్చి 7: కాపునాడు ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షుడిగా నంద్యాల చంటి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటిపల్లి ధర్మరాజును నియమించి రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు నియామక పత్రాలు అందజేశారు. తొలుత చంటి భారీ ఊరేగింపుగా అమలాపురం చేరుకున్నారు. బసవా రామలక్ష్మణ్, కాయల సూరిబాబు, సుంకర నాగేశ్వరరావు, నంద్యాల శ్రీను, అడపా రాము పాల్గొన్నారు.

మన ఓటు - మన హక్కు ర్యాలీ

రాయవరం,మార్చి7: మాచవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మన ఓటు మనహక్కు కార్యక్రమం నిర్వహించారు. ఓటును అమ్ముకోవడం వల్ల కలిగే నష్టాలను, ఓటు హక్కు ప్రాధాన్యం వివరిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముగ్గులను వేశారు. సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.సునీత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం ప్రారంభం

రాజోలు, మార్చి 7: రాజోలులో చాంబర్ ఆఫ్ కామర్స్ కమ్యూనిటీ హాలు నూతన భవనాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ప్రారంభించారు. కల్యాణ వేదికను ఎంపీపీ కేతా శ్రీను ప్రారంభించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దార్ల బాబూజీ, కోశాధికారి కాట్నరాజు, ఎంపీటీసీ చెల్లింగి ఈశ్వరి, దార్ల పెదబాబు, జడ్డు ధనరాజు, ఎస్ఐ జి.పృథ్వీ, చెల్లుబోయిన రాంబాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

కె.గంగవరం, మార్చి 7: కోటిపల్లి పుణ్యక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ అయినవిల్లి వీరవెంకట సత్యనారాయణ (అబ్బు), గోదావరి సూరిబాబు, కోటిపల్లి వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

అంతర్వేది, మార్చి 7: సఖినేటిపలి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు అందించారు.